
# ఉద్యమం

**కోపూరి పుష్పాదేవి**





సాయంత్రం హఠాత్తుగా వాన మొదలయింది. మెల్లగా పెరుగుతోంది. "హమ్మయ్య... తడవకుండా ఇంటికి వచ్చాం. మరొక్క పావు గంట లేటయినా ముద్ద ముద్ద అయిపోయేవాళ్ళం" తాళం తీస్తూ అన్నది సరోజ.

"పిల్లలు రాలేదే ఇంకా?" వరండాలో ఒక పక్కన స్కూటర్ పార్క్ చేస్తూ అన్నాడు సత్యం. అతడి మాట పూర్తవక ముందే కొద్దిగా తడిసి వచ్చారు స్కూలు నుండి వంశీ, చక్రీలు.

"రండి... రండి త్వరగా, తల తుడుస్తాను. ఆలశ్యమయితే జలుబు చేస్తుంది" టవల్ పట్టుకుని సిద్ధంగా నిలబడింది సరోజ.

"అంతగా ఏమి తడిసి పోలేదుగానీ నీ ముద్దుల కొడుకులు, వాన వస్తోందిగా వేడి వేడిగా బజ్జీలు వేస్తారా రాణిగారూ" అడిగాడు సత్యం.

"రాజాగారు అడిగాక ఇక కాదనడమా.. అలాగే వేస్తాను అన్నీ ఉన్నాయి గానీ, వాము ఉందో లేదో" అన్నది సరోజ మొహం కడుక్కోవడానికి వెళ్తూ.

"కావాలంటే చెప్పు... అమ్మా నేను గొడుగు వేసుకువెళ్ళి చిటికెలో తెస్తాను" అన్నాడు వంశీ. వాడికి గొడుగుతో తిరగడమంటే మహా ఇష్టం.

సరోజ, సత్యమూర్తి ఇద్దరూ చిరుద్యోగులు. అతను ప్రైమరీ స్కూలు టీచరు. ఆమె పంచాయితీ ఆఫీసులో క్లర్కు. వారికి ఇద్దరే పిల్లలు. చక్రధర్, వంశీ మాధవ్. ఎనిమిది, తొమ్మిది క్లాసులు చదువుతున్నారు. టైమింగ్స్ ఒకటే అవడంతో సత్యమూర్తి ఉదయం తన స్కూటర్ మీద భార్యను ఆఫీసు దగ్గర దింపి, సాయంత్రం తను స్కూలు నుండి వచ్చేటప్పుడు తీసుకువస్తాడు. వాళ్ళకు పెద్దలిచ్చిన ఆస్తులూ లేవు.

ముచ్చటయిన కాపురం. రెండు గదులూ, చిన్న వరండా. కాకపోతే నీళ్ళకూ వాటికీ ఏమి ఇబ్బందులు లేవు. అందుకే అద్దె కొద్దిగా ఎక్కువ అయినా తప్పడం లేదు వాళ్ళకి.

నూనెలో వేగుతున్న పచ్చి మిరపకాయ బజ్జీలు మంచి వాసనతో ఘుమాయిస్తున్నాయి. ఆ బజ్జీల్లో పెట్టడానికి సత్యమూర్తి డైనింగ్ టేబుల్‌మీద ఉల్లిపాయ ముక్కలు కట్ చేస్తున్నాడు. నిమ్మకాయలు కూడా కోసి రెడీగా పెట్టాడు. అతనెప్పుడూ అంతే. ఆడపనీ, మగపనీ అని అనుకోడు. ఆమె కూడా ఉద్యోగం చేస్తోంది కనుక ఇంటిపనీ, వంటపనుల్లో బాధ్యతగా తనూ భాగస్వామి అవుతాడు. పని అయిపోయాక పిల్లల చదువు విషయమూ శ్రద్ధగా చూస్తాడు. వాళ్ళకి ట్యూషన్ అవసరం లేదు.

"ఆ పనులన్నీ ముందో వెనుకో నేను నిదానంగా చూసుకుంటాను గదా.. ఈ ఆడంగి పనులన్నీ మీకెందుకు..? హాయిగా విశ్రాంతి తీసుకుని, పిల్లల చదువు సంగతి చూసుకోండి చాలు..." అంటుంది సరోజ.

"అదేమిటోయ్.. మీ ఆడవాళ్ళు కొందరు సమాన హక్కులు కావాలంటూ ఉద్యమాలు చేస్తుంటే.. నువ్వేంటీ ఆడంగి పనులూ అదీ ఇదీ అంటావు..." అంటాడు సత్యమూర్తి.

బజ్జీల వాసనకి నోరూరి, "అమ్మా త్వరగా పెట్టు ఆకలేస్తోంది" అన్నాడు వంశీ.

"అయిదు నిముషాలు ఆగు నాన్నా... వేగుతున్నాయి గదా..." అన్నది సరోజ.

"అంత తొందరేంట్రా వంశీ నీకు.. ముందర బట్టలు మార్చుకుని, కాళ్ళూ చేతులూ కడుక్కురా..." అరిచాడు సత్యం.

"మీరెప్పుడూ ఇంతే..." కాళ్ళు బాదుకుంటూ బాత్‌రూమ్‌లోకి నడిచాడు వంశీ.

ముందు వేగిన రెండు వాయిల బజ్జీలు పిల్లలు

ఆవురావురమంటూ లాగించేశారు రుచి బాగుండ డంతో. "ఇక మీరు తీసుకోండి వేడిగా, చల్లారితే రుచి తగ్గుతాయి" అన్నది సరోజ సత్యమూర్తితో.

"మిగిలినవి కూడా అవనీవోయ్.. ఇద్దరం ఒకే సారి తిందాం..." అన్నాడు సత్యం.

ఉరుములు, మెరుపులతో వాన మరింత పెరి గింది.

ఇంతలో వాకిట్లో ఆటో ఆగింది. బిలబిల మంటూ దిగారు సరోజ కాలేజ్ ఫ్రెండ్స్ ముగ్గురు. అనూరాధ, కావేరి, కాంచన. వారిలో అనూరాధ ముంబయి నివాసి. పుట్టింటికి వచ్చినప్పుడు బంధు వుల, స్నేహితుల ఇళ్ళన్నీ సుడిగాలిలా చుట్టబెడుతుం టుంది.

వాళ్ళను చూసి మళ్ళీ పిండి కలిపింది సరోజ. మరి కాసిని ఉల్లిపాయలు తీశాడు సత్యం.

"ఆహా... స్వీట్ హోమ్ అంటే నిజంగా నీదేనే సరూ. బంగారం లాంటి భర్తా.. ముత్యాల్లాంటి పిల్లలూ... ఈ వణికించే వానలో వేడి వేడి మిరప కాయ బజ్జీలు పెట్టావు పుణ్యమంతా నీదేనే.. దీర్ఘా యుష్మాన్ భవ.. దీర్ఘ సుమంగళీభవ... అష్టయిశ్వర్య ప్రాప్తిరస్తు..." వరాలిచ్చే దేవతలా ఫోజు పెట్టింది అనూరాధ.

"వరాలు తర్వాత ఇద్దువు లేవే.. ముందు బజ్జీలు తిను. చల్లారిపోతాయి" అనూరాధ ప్లేట్లో మరో రెండు బజ్జీలు వేసింది సరోజ.

కమ్మని కాఫీ కూడా తాగి, కబుర్లలో పడ్డారు అందరూ.

"అవునే సరూ, మీ వారికి సాయంత్రం ఆరుగంటల్నుంచీ ఖాళీయే గదా.. ఆ టైములో మరో పని ఏదైనా అంటే పార్ట్ టైమ్ జాబ్‌లాగా చేసుకుంటే మీకు ఆర్థికంగా వెసులుబాటు లభిస్తుంది గదా. ఎదిగే పిల్లలూ, పెరిగే ఖర్చులూ.." అన్నది కావేరి.

"ఆ మూడు నాలుగు గంటల్లో ఏం పని చేస్తారు లేవే. పగలంతా పిల్లలతో వాగి వాగి ఉంటారు. ఇంటికి వచ్చాక నాకు హెల్ప్ చేస్తారు. ఇక ఓపిక, తీరిక ఎక్కడుంటాయి?" అన్నది సరోజ.

"అలా కాదే.. ఆలోచించు.. మనసుంటే మార్గముంటుంది. ఈ కాస్త ఇంటిపని నువ్వు చేసు కోలేవా? ఆ టైములో ఆయన ఏదైనా ఉద్యోగం చెయ్యచ్చు" అన్నది అనూరాధ.

"ఆ మూడు నాలుగు గంటలకు ఉద్యోగం ఎవరి స్తారండి బాబు.. అసలే ఉద్యోగాలు దొరక్క నిరుద్యో గులు అల్లాడిపోతుంటేను" అన్నాడు సత్యమూర్తి.

"ఎవరి సంగతో ఎందుకు? మీక్కావాలంటే మా మెడికల్ షాపులోనే ఎక్కౌంటెంట్‌గా చెయ్యచ్చు మీరు. సరయిన మనిషి దొరక్క మేమూ ఇబ్బంది పడుతున్నాము" అన్నది కావేరి.

"వద్దండీ నేను చెయ్యలేను. సాయంత్రం ఆ కాసేపూ పిల్లల చదువులూ అవీ చూడాలి" అన్నాడు సత్యం.

"ఆ పిల్లలకోసమేనండీ మేము చెప్పేది కూడా. రేపు వాళ్ళని ఏ ఇంజనీరింగో, డాక్టరు కోర్సో చది వించాలంటే ఎంత డబ్బు కావాలో ఆలోచించండి" అన్నది అనూరాధ.

"ఏమోనండీ, పార్ట్‌టైమ్ జాబ్ అంటే నాకు ఇంట్రెస్టు లేదు" అన్నాడు సత్యం నిరాసక్తిగా.

"కాదండీ.. వాళ్ళు చెప్పేది కూడా బాగానే ఉంది. ఇద్దరం ఉద్యోగం చేస్తున్నామన్న మాటే గానీ, ఇద్దరివీ చిన్న జీతాలే. సరదాలూ, సంతోషా లకు అవకాశమే లేదు. ఏ చిన్న వస్తువు కొనుక్కో వాలన్నా వందసార్లు ఆలోచించాలి. స్కూటర్ కూడా లోను మీద తీసుకున్నదే కదా. ఉద్యోగం చేస్తున్నా మంచి చీరలు లేవు. నల్లపూసలోకి తెల్ల పూస లేదు... అని మన బంధువులు ఎగతాళి చేస్తు న్నారు" అన్నది సరోజ.


"అవును నాన్నా మన ఆదాయం పెరిగితే మనం ఈ ఇరుకింటి నుండి పెద్ద ఇంటికి మారొచ్చు. మాకూ మంచి బట్టలు కొనచ్చు. ఒప్పుకోండి నాన్నా" అని పిల్లలు.

"సరే.. సరే.. ఆ విషయం నిదానంగా ఆలోచిం చొచ్చు. మీ స్నేహితుల సంగతులేమిటో చూడు" అన్నాడు సత్యం షర్టు వేసుకుని బయటకు వెళ్ళ బోతూ.

"నిజమేనే.. మేము ఆలోచించుకుని రెండు రోజుల్లో నీకు ఏ విషయమూ ఫోను చేస్తాను"

## గ్లామరస్ ఛార్మి

బాపు రూపొందిస్తున్న 'సుందరకాండ' సిని మాలో సరికొత్త ఛార్మిని చూడబోతున్నాం. సాధారణంగా తను తీయబోయే సినిమా సన్నివే శాలని ముందుగానే కాగితంపై స్కెచ్‌లు గీసు కుని మరీ చిత్రీకరించే అలవాటున్న బాపు ఈ సినిమా కోసం ఛార్మిని దాదాపు 65 విభిన్నమైన పోజుల్లో చూపించే ప్రయత్నం చేసార్ట. 'సుందర కాండ' సినిమా ఛార్మి సౌందర్యాన్ని మరింత ఇనుమడింప చేయబోతుందన్నమాట.



అన్నది సరోజ, కావేరితో.

వాన తగ్గింది. ఏవేవో కబుర్ల తర్వాత, "అమ్మో.. చాలా టైము అయింది. మాటల్లో పడి చూసుకోలేదు" అంటూ వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆ రాత్రి పక్కల మీద చేరాక మళ్ళీ మొదలుపెట్టింది సరోజ. "ఏమండీ కావేరి చెప్పిన విషయం బాగానే ఉందండీ. ఇప్పుడు పల్లెలో ఉన్న అత్తయ్య, మామయ్యలకు డబ్బు పంపా లన్నా ఇబ్బందిగా ఉందా. పాపం వాళ్ళు ఆ గేదెలతో ఇంకెన్నాళ్ళు కష్టపడతారు.. పెద్దవాళ్ళవుతున్నారు గదా.. మనం కూడా ఏదో ఒక చిట్ కట్టి డబ్బు వెనకేసుకోవచ్చు. ఎన్నాళ్ళని ఇలాగే ఉండి

పోతాం చెప్పండి" అన్నది సరోజ.

"ఆదాయం పెరిగితే బాగానే ఉంటుందే.. కానీ దానికోసం నువ్వూ నేనూ ఎంత ఒళ్ళు హూనం చేసుకోవాలో చూడు. నువ్వు పగలంతా ఆఫీసులో చాకిరీ చేసి వస్తావా.. వచ్చాక వంటా, అంట్లూ, బట్టలూ అన్ని పనులూ ఒక్క దానివీ చేసుకోవాలి. పిల్లల చదువు సంగతి చూడకపోతే వాళ్ళ గతి ఏమవుతుందో ఆలోచించు" అన్నాడు సత్యం.

"ఏమీ అవదు. ట్యూషన్‌కు పంపుదాం. దివ్యంగా ఉంటుంది. నేనూ పని మనిషిని పెట్టుకుంటాను. లేకపోతే వాషింగ్ మిషన్ కొనుక్కుంటాను. డబ్బుండాలే కానీ సౌకర్యాలు, సుఖాలకేం తక్కువ? అదీకాక కావేరీ వాళ్ళాయన కూడా సహృదయుడు. వాళ్ళది చాలా మంచి సంస్థ కూడా. ఇంకేమీ ఆలోచించకండీ.. ఒప్పుకోండీ" బతిమాలింది సరోజ.

భార్య, పిల్లల మనసు బాధపెట్టడం ఇష్టంలేక అర్ధాంగీకారంతో ఒప్పుకున్నాడు సత్యమూర్తి.

ఆరు నెలలు గడిచాయి. మొదటి నెల నలుగురూ రెండేసి జతల బట్టలు కొనుక్కున్నారు. రెండవ నెలలో పల్లెకు డబ్బు పంపారు. మూడవ నెలలో వాయిదాల పద్ధతిలో ఫ్రిజ్ కొన్నారు. ఇల్లు మారారు. బ్లాక్ అండ్ వైట్ టీవీ స్థానంలో పెద్ద కలర్ టీవీ వచ్చింది. వాషింగ్ మిషన్ వచ్చింది. సోఫా, డైనింగ్ టేబుల్ వంటి ఫర్నిచర్‌తో అప్పులు అయినాయిగానీ ఇప్పుడు ఇల్లు గ్రాండ్‌గా కనిపిస్తోంది.

సమస్యలూ మొదలయ్యాయి. పని మనిషి సరిగ్గా వచ్చీ రాకా పని ఎక్కువై సరోజ రెండు రోజులు లేస్తే నాలుగు రోజులు లేవనట్లు తయారయింది. పిల్లల మార్కులు నెలనెలకూ వెనక్కు వెళ్తున్నాయి. సత్యమూర్తి ఇది వరకు ఎప్పుడు చూసినా ప్రశాంతంగా, హాయిగా, ఆనందంగా ఉండేవాడు. ఇప్పుడేమిటో ప్రతిదానికీ ఎంతో చిరాకు పడ్తున్నాడు. భార్యా పిల్లల మీద విసుక్కుంటున్నాడు. అతనికి ఆదివారాలు కూడా ఊపిరాడనంత పని ఉంటోంది.

ఇప్పుడు అతనితో ఏం మాట్లాడాలన్నా సరోజకు భయమేస్తోంది. పిల్లల గురించి కూడా ఆమెకు దిగులు పట్టుకుంది. ఈ మధ్య వాళ్ళపై తండ్రి అదుపాజ్ఞలు లేకపోవడంతో వాళ్లు స్కూలుకు, ట్యూషనుకు కూడా సరిగ్గా వెళ్ళడం లేదు. చెడు సహవాసాలు చేస్తూ సినిమాలూ, సిగరెట్లతో డబ్బు నాశనం చేస్తున్నారు. సరోజ మందలిస్తే ఆమెకు ఎదురు తిరుగుతున్నారు. భర్త చూస్తే అసలే చిరాకుగా, కోపంగా ఉంటున్నాడు. అతనితో ఈ విషయాలు ఎలా చెప్పాలో ఆమెకు అర్థం కావడం లేదు. ఒక ప్రక్క తన అనారోగ్యం.. తప్పని ఉద్యోగం.. మరో వంక పిల్లల సమస్య..

"ఏం చెయ్యాలిరా భగవంతుడా?"

○○○

పిల్లలిద్దరూ పరీక్ష తప్పారు.

ఆ రాత్రి సత్యమూర్తి సరోజ మీద ఇంత ఎత్తున మండి పడ్డాడు. "ఇప్పుడు బాగుందా..? డబ్బుతో బాగా సుఖంగా సౌకర్యంగా ఉందా? చేసుకున్న వాళ్ళకు చేసుకున్నంత మహదేవా అంటారు. నేనా ఉద్యోగం చెయ్యలేను మొర్రో అంటే వినకుండా నన్ను పంపావు. అక్కడ నా బుర్ర నాశనమైపోతోంది. ఇక్కడ నీ ఆరోగ్యం నాశనమయింది. పిల్లలకు ఒక సంవత్సరకాలం నాశనమైంది. నెత్తినిండా అప్పులు.. వడ్డీలు.. ఇప్పుడేం చెద్దాం చెప్పు" సంవత్సరం నుండీ దాచుకున్న ఆవేదన అగ్నిపర్వతంలా బద్దలయింది.

అతను.. అతను.. ఏడుస్తున్నాడు.

తన పెళ్ళి అయిన పదహారు సంవత్సరాల కాలంలో సత్యమూర్తిని ఆ విధంగా ఎప్పుడూ చూడలేదు సరోజ. ఆమె మెదడు మొద్దుబారిపోయింది. మనిషి శిలా విగ్రహమయింది. ఆమెలో ఆత్మ విమర్శ ప్రారంభమయింది. అవును ఆయన చెప్పింది అక్షరాలా నిజం. ఇదంతా తన స్వయంకృతాపరాధం.. అందరిలా తనూ తన పిల్లలను డాక్టర్లో, ఇంజనీర్లో చెయ్యాలని ఆశ పడింది. ఆశ ఉండడంలో తప్పులేదు. కానీ దానికి తోడు ఆలోచన ఉండాలి. కఠినమైన ఆచరణ ఉండాలి. ఆలోచన లేని ఆశ అనర్థాన్నే ఇస్తుంది.

ఎక్కడో, ఏదో తేడా వచ్చింది.

ఆమె ఆలోచనకు పదును పెట్టింది. పిల్లలను పెద్ద చదువులు చదివించాలన్న మంచి ఆశయంతో కొత్త జీవితంలోకి అడుగుపెట్టిన తాము ఆశయాన్ని అలక్ష్యం చేసి ఆశలకు ప్రాముఖ్యతనిచ్చాము. అక్కడే దెబ్బ తిన్నాము. ఉన్నతమైన లక్ష్యానికి చేరదలిచినప్పుడు మన సర్వశక్తి సామర్థ్యాలూ దానికే ధారపొయ్యాలి. పక్క చూపులు చూడకూడదు. ఇకపై తమ లక్ష్యం గమ్యం అన్నీ పిల్లల చదువే.. మరేదీ, ఏదీ లేదు. సత్యమూర్తి ఆ పార్ట్‌టైమ్ జాబ్ మానేసినా ఫర్వాలేదు. తమ ఇద్దరి జీతాలతోనే ఇద్దరు పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వగలము- నిండయిన ఆత్మ విశ్వాసంతో ఆమె ముఖంలోకి కొత్త వెలుగు వచ్చింది. ○

## ప్చ్! ఏంటో!!

ఆమధ్య హీరోయిన్ ఛార్మి-మ్యూజిక్ డైరెక్టర్ దేవిశ్రీప్రసాద్ పెళ్లిచేసుకుంటారనే వార్త బాగా పాపులర్ అయింది. అయితే ఇరు వైపుల నుంచీ ఖండనలు వచ్చిన తర్వాత అంతకు ముందులా ఇద్దరూ ఎక్కువగా కలిసి ఫంక్షన్లలో కనిపించడం మానేసారు. తాజాగా దేవిశ్రీ-మమతా మోహన్‌దాస్ 'దోస్తీ' గురించి సినీ జనాలు చెవులు కొరుక్కుంటున్నారు. ఇందులో నిజానిజాల మాటెలా వున్నా ఓ ఔత్సాహిక నిర్మాత ఛార్మి దగ్గరకెళ్లి- మిమ్మల్నీ మమతా మోహన్‌దాస్‌ని కలిపి హీరోయిన్లుగా ఓ సినిమా తీద్దామనుకుంటున్నాను అంటే- ఠక్కున ఛార్మి ఆ ఆఫర్ని తిప్పికొట్టిందిట.

